క్లుప్తంగా

బీసీలను మోసం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ



ఇందల్వాయి: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి విమర్శించారు. మండల కేంద్రంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేత బండి సంజయ్‌ని తొలగించి ఇప్పుడు బీసీని ముఖ్యమంత్రి చేస్తామనడం హాస్యాస్పదమని అన్నారు. అధిక శాతం ఉన్న బీసీలకు అత్యల్పంగా టికెట్లను కేటాయించి బీఆర్ఎస్ కూడా బీసీల పట్ల తన వైఖరిని స్పష్టం చేసిందన్నారు. బీజేపీ వెంటనే బీసీ ముఖ్యమంత్రి అభ్యర్థిని కూడా ప్రకటించాలన్నారు. రెండు పార్టీలను ప్రజలు నమ్మవద్దని, బీసీలకు సామాజిక న్యాయం చేస్తూ కుల గణన హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీనే ప్రజలు గెలిపించాలన్నారు. రూరల్ నియోజకవర్గంలో ఈసారి కాంగ్రెస్ గెలుపుకు బీసీలు ఏకం కావాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తక్షణ ప్రవేశాల (స్పాట్ అడ్మిషన్స్)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ (హెచ్‌ఈపీ), బీకాం (కంప్యూటర్స్), బీఎస్సీ (లైఫ్ సైన్సెస్–బీజెడ్‌సీ), బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్–ఎంపీసీ, ఎంపీసీఎస్) కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ 9177563723, 9705336530, 9440019918 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'పవర్ డిప్లొమా ఇంజినీర్స్' కార్యదర్శిగా రాజశేఖర్



తోట రాజశేఖర్

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఎన్నికలు గురువారం రాత్రి వరంగల్‌లో జరిగాయి. ఈ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా నుంచి తోట రాజశేఖర్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కాశీనాథ్, శ్రీనివాస్ తదితరులు రాజశేఖర్‌కు అభినందనలు తెలిపారు.

బాజిరెడ్డి హ్యాట్రిక్ గెలుపు తథ్యం



మోపాల్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా బాజిరెడ్డి గోవర్ధన్ హ్యాట్రిక్ విజయం ఖాయమని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం జగన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో ముందజలో ఉందన్నారు. అంతకు ముందు మోపాల్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు, సర్పంచులు రవి, ముత్యంరెడ్డి, శ్రీనివాస్‌రావు, సతీష్‌రెడ్డి, కన్నీరాం, నరేష్, రాజశేఖర్‌రెడ్డి, అజీమ్, సిద్ధార్థ, భూమయ్య పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన



సిరికొండ: మండలంలోని గడ్కోల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాంకు లావాదేవీలపై స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ యాదగిరిగౌడ్ అవగాహన కల్పించారు. నాబార్డు ఆధ్వర్యంలో పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేనేజర్ మాట్లాడుతు పొదుపు ఖాతాలు, జీవిత బీమా పాలసీల గురించి వివరించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఇంద్రజాల ప్రదర్శన చేయించారు. పీజీహెచ్‌ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



ఎమ్మెల్యేకు తీర్మాన ప్రతిని అందజేస్తున్న దమన్నపేట గ్రామస్తులు



ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బోర్గాం(పి) నాయకులు

మోపాల్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని తన నివాసంలో బోర్గాం(పి) 5వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు నుడా చైర్మన్ సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో బాజిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. నాయకులు చిట్టి పండరి, శ్యామకూర సాయిరెడ్డి, గోపి, విజయ్, శ్యాంరావు, గంగాధర్, తదితరులు 50 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సారెడ్డి, హన్మండ్లు, దాస్, శ్రీనివాస్, భూషణ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చూసే చేరికలు

ధర్పల్లి: రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలకు ఆకర్షితులై చాలా మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శుక్రవారం నగరంలోని తన నివాసంలో మండలంలోని రామడుగు, ధర్పల్లి, గోవిందపల్లి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, హనుమంత్ రెడ్డి, చిన్నారెడ్డి, రంజిత్, సురేందర్ పాల్గొన్నారు.

బాజిరెడ్డికి మద్దతుగా తీర్మానం

ధర్పల్లి: మండలంలోని దమన్నపేట సర్పంచ్ కొండశేఖర్ ఆధ్వర్యంలో రజక సంఘం సభ్యులు శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా తీర్మానం చేశారు. ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు శుక్రవారం అందజేశారు. బాజిరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టీ మూడోసారి గెలిపించుకుంటామని రజక సంఘం సభ్యులు తెలిపారు. దుబ్బాకలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ప్రతాప్‌గౌడ్, ఎంపీటీసీ గంగాధర్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ యాదవ పెద్ద సంఘం సభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు తెలిపారు.

మద్దతు తెలిపిన విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య (బీడీఎస్ఎఫ్) నాయకుడు ధనవేందర్ యాదవ్, మహమ్మద్ అక్తర్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసిన విద్యార్థులు ఈ ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కృష్ణవర్ధన్, రమేష్ యాదవ్, రిజ్వాన్, హరికృష్ణరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జక్రాన్‌పల్లి: మండలంలోని బాలానగర్ సర్పంచ్ నిహారిక ఈశ్వర్ మామ ఒడ్డె శంకర్ ఇటీవల మరణించారు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, పడకల్ సర్పంచ్ పుప్పాల శ్రీనివాస్, కుంచాల రాజు, అప్పాల అరుణ్, తిరుపతిరెడ్డి, బాల్‌కిషన్, దీకొండ శ్రీనివాస్, రాజన్న, భోజన్న పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశమివ్వండి

- కబ్జాలు, కమీషన్లు లేని నియోజకవర్గంగా మారుస్తా
- బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ



ధన్‌పాల్ సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో కబ్జాలు, కమీషన్లు లేకుండా మారుస్తానని, కమలం పువ్వు గుర్తుకు ఓటేసి ఒక్కసారి అవకాశమివ్వాలని బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలోని విజయలక్ష్మీ గార్డెన్‌లో పద్మశాలీ అభిమాన సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ పద్మశాలీలు ఉన్నత స్థానాల్లో ఉండేందుకు తనవంతు కృషి చేస్తానని, పద్మశాలీ కుటుంబాలతో వ్యాపారంలో అవినాభావ సంబంధం ఉందన్నారు. పద్మశాలీ సోదరులు అడిగిన వెంటనే ట్రస్ట్ ద్వారా రూ.11లక్షలు అందజేశానని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. పద్మశాలీ సంఘం నాయకులు గజం ఎల్లప్ప, చిలుక నర్సయ్య, బోగ అశోక్, పెంటం దత్తాద్రి, కార్పొరేటర్లు చందుపట్ల వనిత శ్రీనివాస్, ఇప్పకాయల సుమిత్ర కిశోర్, అవధూత దశరథం, వెంకటేష్, బింగి మోహన్ పాల్గొన్నారు.

వంజరులకు అండగా ఉంటా..

వంజరి సోదరులకు అన్ని విధానాలు అండగా ఉంటానని బీజేపీ అర్బన్ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని దుబ్బ మున్నూరుకాపు సంఘంలో వంజరి ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వంజరులతో ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉందని తెలిపారు. ఉద్యమ సమయంలో యావత్ ప్రజానీకానికి తెలిసేలా చేపట్టిన రక్తంతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మర్చిపోలేమన్నారు. బీఆర్ఎస్ పాలనలో నగరం ఆగమైందని, అన్నిరంగాల్లో వైఫల్యం చెందిందని ఆరోపించారు. అనంతరం భారీ గజమాలతో సంఘం యువకులు ఆయనను సన్మానించారు. సంచార జాతుల బోర్డు సభ్యుడు ప్రవీణ్‌రావు, వంజరి మహారాష్ట్ర అధ్యక్షుడు అనిల్ దాస్‌పాడ్, కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, బూర్గుల ఇందిరా వినోద్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, మాస్టర్ శ్రీనివాస్, గంగోనె విఘ్నేష్, టెంట్ శ్రీను, ఆమంద్ విజయ్ కృష్ణ పాల్గొన్నారు.

అర్బన్‌లో కాషాయజెండా ఎగురవేస్తాం

నిజామాబాద్ అర్బన్‌లో కాషాయ జెండా ఎగురేసి, అవినీతిరహిత పాలనను అందిస్తామని సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని గోనెరెడ్డి కల్యాణ మండపంలో 25వ డివిజన్ నాయకులు ఎలసాని సాయిరాజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు ధన్‌పాల్‌కు గజమాలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రధాని మోదీ పథకాలకు ఆకర్షితులై యువకులు బీజేపీలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. నగరంలో బీఆర్ఎస్ పాలనలో అవినీతి పెచ్చుమీరిపోయిందని, ఎమ్మెల్యే కబ్జాలు, కమీషన్లకే పరిమితమయ్యారని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేని ఎమ్మెల్యే అవసరమా అని ప్రశ్నించారు. నాయకులు పంచరెడ్డి లింగం, లక్ష్మీనారాయణ, బంటు రాము, గిరిబాబు, పంచరెడ్డి శ్రీధర్, ఇల్లెందుల ప్రభాకర్, ఆశిష్, హరీశ్‌రెడ్డి పాల్గొన్నారు.



ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తాను గజమాలతో సన్మానిస్తున్న వంజరి సంఘం యువకులు

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి

సిరికొండ: రెండు సార్లు అవకాశం ఇస్తే బాజిరెడ్డి గోవర్ధన్ నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి విమర్శించారు. మండలంలో ఎన్నికల ప్రచారాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అంగడిబజార్ నుంచి సభా ప్రాంగణం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో భూపతిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగు నీరు తెస్తానని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఒక్క ఎకరానికి సాగు నీరు తేలేకపోయారని విమర్శించారు. 21వ ప్యాకేజీని తుంగలో తొక్కారని ఆరోపించారు. ఆస్తులు పెంచుకున్నాడే తప్పా నియోజకవర్గాన్ని గాలికొదిలేశాడని ఆరోపించారు. ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్ మాట్లాడుతు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఏం చేస్తామో చెప్పకుండా కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వందల ఏళ్లు నిలవాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడే కుంగిపోవడం కేసీఆర్ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. గడ్కోల్, కొండపూర్, రావుట్ల, న్యావనంది, నర్సింగ్‌పల్లి, పెద్దవాల్గోట్, పందిమడుగు, దుప్య తాండ, తూంపల్లి గ్రామాలకు చెందిన వందలాది మంది భూపతిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. హుస్సేన్‌నగర్ గ్రామస్తులు రూ.50 వేలు, గడ్కోల్ గ్రామస్తులు రూ.25 వేలు, ముషీర్‌నగర్ గ్రామస్తులు రూ.5 వేలు భూపతిరెడ్డికి విరాళం అందచేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, శేఖర్‌గౌడ్, గంగారెడ్డి, రవి, సంతోష్, గౌస్, మల్లేష్, రమేష్, ప్రసాద్, భాస్కర్, సంతోష్‌నాయక్, శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, భానుచందర్, రాజేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లిలో బీజేపీ యువమోర్చా గ్రామ అధ్యక్షుడు రోహిత్‌తో పాటు 25 మంది కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. రూరల్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మోత్కూరి నవీన్‌గౌడ్, వెంకటరెడ్డి, సంతోష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, దండ్ల రాజన్న, ఎంపీ గంగన్న, ఎడ్ల సాయిలు, రామి రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే 'మంచిప్ప' నిర్మాణం

బీజేపీ రూరల్ అభ్యర్థి దినేష్‌కుమార్



మాట్లాడుతున్న దినేష్‌కుమార్

డిచ్‌పల్లి: గాంధారి మండలం చద్మల్ ప్రాంతంలో నిర్మించాల్సిన ప్రాజెక్టును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కమీషన్ల కోసమే మంచిప్ప– మాసాని వద్ద నిర్మిస్తున్నారని బీజేపీ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కులాచారి దినేష్‌కుమార్ ఆరోపించారు. పార్టీ అధిష్టానం తనకు రూరల్ ఎమ్మెల్యే టికెట్ కేటాయించిన అనంతరం శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దినేష్‌కుమార్ మాట్లాడారు. రాజకీయంలో శత్రువులు ఉండరని కేవలం ప్రత్యర్థులు మాత్రమే ఉంటారన్నారు. రూరల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి ఇద్దరు వృద్ధులు తనకు ప్రత్యర్థులుగా ఉన్నారని పేర్కొన్నారు. వారు ఇక రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తీసుకుని యువతకు అవకాశం ఇవ్వాలని హితవు పలికారు. కామారెడ్డిలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మంచిప్ప–మాసాని ప్రాజెక్టు ద్వారా కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రాంతాలకు తాగు, సాగు నీరందిస్తామని ప్రకటించారన్నారు. దీన్ని బట్టే చద్మల్ ప్రాంతంలో కట్టాల్సిన ప్రాజెక్టును కమీషన్ల కోసం మంచిప్ప వద్ద కడుతున్నారని, తద్వారా సుమారు 10వేల మంది ప్రజలు నిర్వాసితులయ్యే దుస్థితి నెలకొందన్నారు. తనను గెలిపిస్తే గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మూతపడిన సారంగపూర్ చక్కెర కర్మాగారం (ఎన్‌సీఎస్ఎఫ్) తెరిపిస్తామన్నారు. డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, పద్మారెడ్డి, ఎస్ రాజశేఖర్‌రెడ్డి, శ్యాంరావు, యాదగిరి, ఆనంద్, నక్క రాజేశ్వర్, ఆనంద్, జగన్‌రెడ్డి, రవి, రాజన్న, మేక బాగారెడ్డి, ప్రమోద్, శ్రీనివాస్‌యాదవ్, నవీన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శంకర్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు విలువైనది

బోధన్‌టౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని జిల్లా స్వీప్ నోడల్ అధికారి సురేష్ కుమార్, సెంట్రల్ బ్యూరో కమ్యునికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి ధర్మనాయకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో కేంద్ర మంత్రిత్వ శాఖ,సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. శాసనసభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మద్యానికి, డబ్బుకు, ప్రలోభాలకు లోనై ఓటు వేయొద్దని కోరారు. అనంతరం ఓటు హక్కుపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, మహిళా సంక్షేమ శాఖ అధికారి రసూల్‌బీ, అదనపు డీఆర్‌డీవో సంజీవ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం పాల్గొన్నారు.

అవినీతి వ్యతిరేక ర్యాలీ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల, పాఠశాల విద్యార్థులు శుక్రవారం అవినీతి వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాలు అవినీతి నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.

పాఠశాలలో వైద్య శిబిరం

వర్ని: మండలంలోని శ్రీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీను నాయక్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 68 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ సంజయ్, పాఠశాల హెచ్‌ఎం గంగమణి పాల్గొన్నారు.

రిలే దీక్షలు కొనసాగిస్తాం

బోధన్: షుగర్ ఫ్యాక్టరీ మూసివేత నాటి నుంచి తమకు రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఎన్డీఎస్ఎల్ కార్మిక సంఘం నాయకుడు నాగేశ్వర్ అన్నారు. కార్మికులు శక్కర్‌నగర్ షుగర్ ఫ్యాక్టరీ ప్రధాన గేటుకు ఎదురుగా చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 91వ రోజుకు చేరాయి. దీక్షలో అన్వర్ మియా, రఘునాథ్ కూర్చున్నారు.

జీవాలకు పీపీఆర్ టీకాలు



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌లో గొర్రెలకు పీపీఆర్ టీకాలను పశు వైద్యాధికారి గౌతంరాజు ఆధ్వర్యంలో శుక్రవారం అందించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించిన దాణా, మందులను ఉచితంగా అందజేశారు.

రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకొని బియ్యం అందించని రైస్‌మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు క్వింటాలుకు 8 కిలోల వరకు కడ్తా తీసుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కడ్తా రెండు కిలోలు తీసుకున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ హయాంలో నందిపేట్ మండలంలో లక్కంపల్లి సెజ్ ఏర్పాటు చేసినా.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఫుడ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్ప తర్వాత ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,200	వెండి (కిలో)	76,500
22 క్యారెట్స్	57,350		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	17	30
బీర్నిసుకాయ	50	75	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	60	గోబిపువ్వు	40	60
వంకాయ	30	60	బీట్‌రూట్	30	60
పాలకూర	50	70	కరివేపాకు	40	60
మెంతికూర	70	90	చామగడ్డ	40	60
కొత్తిమీర	60	80	గోరుచిక్కుడు	40	60
పుదీనా	60	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: మా ఊరి పొలిమేర-2 -11.00,10.30; భగవంత్ కేసరి -1.30, 7.20; విధి(తెలుగు)-4.30
- స్క్రీన్-2: శంకర్ దాదా ఎంబీబీఎస్ -10.30; లియో(తెలుగు)- 1.40, 10.20; మా ఊరి పొలిమేర-2(తెలుగు)-4.40; ఘోస్ట్(తెలుగు)-7.30
- స్క్రీన్-3: కీడా కోలా(తెలుగు)-10.50 1.40 4.40 7.30 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: నరకాసుర(తెలుగు)-10.35; కోలా(తెలుగు)-1.35 7.40; కేసరి(తెలుగు)-4.15
- స్క్రీన్-2: మా ఊరి పొలిమేర-2(తెలుగు)-1.15, 7.30,10.20; లియో(తెలుగు)-4.05
- స్క్రీన్-3: మా ఊరి పొలిమేర-2 -10.30; విధి(తెలుగు)-1.20; టైగర్ నాగేశ్వరరావు(తెలుగు)-3.45; కృష్ణ ఘట్టం(తెలుగు)-7.10
- స్క్రీన్-4: శంకర్ దాదా ఎంబీబీఎస్ -9.40; ఘోస్ట్(తెలుగు)-1.15; నరకాసుర(తెలుగు)-4.10; లియో(తెలుగు)-7.10; భగవంత్ కేసరి(తెలుగు)-10.35

- దేవి: మా ఊరి పొలిమేర-2(తెలుగు)
- నటరాజ్: టైగర్ నాగేశ్వరరావు(తెలుగు)
- లలితామహల్: భగవంత్ కేసరి(తెలుగు)
- విజయ్: కీడా కోలా(తెలుగు)

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



ఇందల్వాయి: బీఆర్ఎస్ మండల నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ని గెలిపించాలని పలు తండాల్లో శుక్రవారం ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఎన్నికల హామీలను గిరిజనులకు వివరించారు. గన్నారం గ్రామానికి చెందిన పలువురు ముదిరాజ్ సంఘ సభ్యులు ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ సమక్షంలో జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్‌లో చేరినట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దాసు తెలిపారు. ఎంపీపీ రమేష్ నాయక్, ఎంపీటీసీ చింతల దాసు, కుమార్, రఘు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నిజామాబాద్‌రూరల్: మండలంలోని సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీలో సాయి వెజిటేబుల్స్–ఫ్రూట్ గ్రోయర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు చైర్మన్ కొండెల సాయిరెడ్డి తెలిపారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గంగారెడ్డి, మమ్మయి రాజన్న తదితరులు పాల్గొన్నారు.



అమరుల ఆశయ సాధనకు ఉద్యమిద్దాం



ఖలీల్‌వాడి: భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం అనేకమంది వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని వారందరిని స్మరించుకోవడం మన కర్తవ్యమని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని నీలం రామచంద్రయ్య భవనంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమరుల ఆశయ సాధనకు ఉద్యమించాలన్నారు. డివిజన్ సెక్రెటరీ వేల్పూర్ భూమన్న మాట్లాడుతూ పీడిత ప్రజల కోసం ప్రాణాలర్పించిన వీరుల ఆశయ సాధనకు పోరాడుతామన్నారు. పరుచూరి శ్రీధర్, నీలం సాయిబాబా, ఆకుల అరుణ, అరుణ రేఖ, వనమాల సత్యం, సాయిరెడ్డి, ఎర్రన్న, గంగాధర్ పాల్గొన్నారు.